

సోమశిలకు వరద జలాలు

జలాశయంలో ఆదివారానికి 28.350 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 2148 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 2,700, ఉత్తర, దక్షిణ కాలువలకు 775 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,990
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,140
3 శాతం జీఎస్టీతో	రూ.9,414
నవర (8 గ్రా)	రూ.75,312

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.0 /29.9

జిల్లాలో సోమవారం వాతావరణం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. ఆదివారం గాలిలో తేమ 47 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న జయలక్ష్మి




జయలక్ష్మికి శేషవస్త్రాలు, ఆశీర్వచనాలు అందజేస్తున్న ఈఓ, అర్చక, వేదపండితులు

నెల్లూరు (బృందావనం): నగరంలోని దర్గామిట్టలో కొలువైన శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ భూ పరిపాలన ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జి.జయలక్ష్మి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆమెను దేవస్థానం ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభంతో సంప్రదాయంగా ఆహ్వానించారు. దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షీసుందరేశ్వరస్వామి వారిని దర్శించుకొన్నారు. అమ్మ వారికి ఖడ్గమాల పూజ చేయించారు. అనంతరం అర్చకులు వేదమంత్ర ఆశీర్వచనాలతో శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి దృష్టికి దేవదాయశాఖ భూమిని వెబ్‌ల్యాండ్‌లో అప్‌డేషన్ జరిగేలా రెవెన్యూ అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని ఈఓ జనార్దన్‌రెడ్డి కోరారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందిస్తూ తగిన ఆదేశాలు ఇస్తామని తెలిపారు. దేవస్థానం పక్కన ఉన్న రెవెన్యూ భూమి నుంచి కొంత స్థలం దేవస్థానానికి కేటాయిస్తే.. పార్కింగ్‌కు ఎటువంటి సమస్యలు తలెత్తవనే విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఆమె వెంట నెల్లూరు ఆర్డీఓ అనూష ఉన్నారు.

ఉల్లాసంగా, ఉత్సాహంగా రెవెన్యూ క్రీడలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 10వ రెవెన్యూ క్రీడలను మూడో రోజు ఆదివారం రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్, ప్రత్యేక రెవెన్యూ కార్యదర్శి జి.జయలక్ష్మి ప్రారంభించారు. మూడో రోజు ఆటలు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగాయి. తొలుత కలెక్టర్ ఓ ఆనంద్‌తో కలిసి ఇండోర్ స్టేడియంలో కలెక్టరేట్ టీం, డివిజన్ టీం మధ్య జరిగిన బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. మహిళా విభాగంలో అండర్–35 100 మీటర్ల పరుగు పందెంలో గెలుపొందిన సాహిత్య, అనూష, శాంతిప్రియలకు మొదటి మూడు బహుమతులను కలెక్టర్ ఆనంద్‌తో కలిసి అందజేశారు. షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్‌సాహెబ్, ఆర్డీఓలు అనూష, అవని, వంశీకృష్ణ, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎం పెంచలరెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నటుడు 'కోట'కు సింహపురితో అనుబంధం



నెల్లూరు (బృందావనం): తెలుగు చలన చిత్ర రంగంలో విభిన్న పాత్రలను అలవోకగా పోషించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని విలక్షణ నటుడిగా కీర్తిప్రతిష్టలందుకొన్న కోట శ్రీనివాసరావుకు నెల్లూరుతో అనుబంధం ఉంది. నటుడిగా ప్రస్థానం సాగిస్తున్న తొలి రోజుల్లో పురమందిరంలో నెఫ్జా సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నెఫ్జా నాటక కళాపరిషత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1995లో నెల్లూరు పాదలకూరురోడ్డులో సుమన్, సౌందర్య నటీనటులుగా నెల్లూరీయుడు శ్రీధర్‌రెడ్డి నిర్మాతగా నిర్మించిన 'బాలరాజు బంగారుపెళ్లాం' సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించారు. ఆ చిత్రం షూటింగ్ పాదలకూరురోడ్డు, పొగాకు గోడౌన్, నెల్లూరు పరిసరాల్లో జరుపుకొంది. దాదాపు 10 రోజుల పాటు ఆ చిత్ర నిర్మాణం నెల్లూరులో జరిగింది. ప్రతిఘటన చిత్రంతో స్టార్‌డమ్ అయిన తర్వాత కోట నెల్లూరుకు మళ్లీ ఎన్నడూ రాలేదని సమాచారం.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్ట్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఓ వ్యక్తి దగ్గర గంజాయి ఉందన్న స్థానికుల సమాచారంతో ఆదివారం పోలీసులు దాడి చేశారు. అతని వద్ద నుంచి 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలానికి చెందిన మస్తాన్ బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ సమీపలో పెన్నానది బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం అందడంతో ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడి వద్ద 1.3 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ వద్ద హాజరు పరిచి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భూములను బలవంతంగా లాక్కునే కుట్ర



మాకు ప్రభుత్వం భూమిని కేటాయించినప్పటి నుంచి భూములను సాగు చేసుకుంటున్నాం. మాకు తెలియకుండా గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు మా భూములను వారిపై ఆన్‌లైన్ చేయించుకున్నారు. భూముల పట్టాలు, సాగు రికార్డు అంతా మా పేరుతో ఉన్నా వారికి ఎలా చేశారో తెలియదు. దీనిపై ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. అధికారుల విచారణకు హాజరవుతున్నాం. ఈలోపే మా భూములను స్వాధీనం చేసుకునే కుట్ర చేస్తున్నారు. – ఉన్నం భాస్కరరావు

భూముల్లోకి రాకుండా బెదిరిస్తున్నారు



గిరిజన కోటలో నాకు ప్రభుత్వం మా ఊరిలో ఇచ్చిన ఎకరం భూమిని ఇప్పుడు లాక్కునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. నా భూమిలోకి నన్ను పోకుండా బెదిరిస్తున్నారు. అధికారుల వద్ద భూముల పంచాయితీ జరుగుతున్నా.. జేసీబీలు తెచ్చి భూములను సాగు చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అన్ని పత్రాలు మా దగ్గర ఉన్న వాళ్లకు భూముల ఎలా వస్తాయో అర్థం కావడం లేదు. – జగన్నాథం నాగేశ్వరరావు

అన్ని రికార్డులు మా పేరుతోనే ఉన్నాయి



మాకు ప్రభుత్వం కేటాయించిన భూమిని అధికారం అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు కాజేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అధికారుల వద్ద పంచాయితీ తేలకుండానే ఇటీవల భూముల్లోకి వచ్చి సాగు చేసే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకుని మా భూములను మాకు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. – ఉన్నం మునలయ్య, దళితుడు

దళితుల భూమి తమ్ముళ్లకు కట్టబెట్టి..


రెవెన్యూ అధికారుల అవినీతికి నిరు పేదలైన దళితులు ఏళ్ల తరబడి అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూములను దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు దళితుల భూములపై కన్నేసి, అధికారులను లోబర్చుకుని రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డుల్లో తమ పేర్లు ఎక్కించుకుని హక్కుదారులను పొలాల్లోకి రాకుండా అడ్డుకుంటూ బెదిరింపులకు దిగుతున్నారు. తాజాగా మరింతగా రెచ్చిపోతున్నారు. అధికారాన్ని ఆయుధంగా మలుచుకుని, జేసీబీలు ముందుకు దూసుకొస్తుంటే.. రికార్డులన్నీ తమవైపే ఉన్నా, అధికారుల 'ఆన్‌లైన్ మాయాజాలం' ముందు దళితులు న్యాయ పోరాటంలో అలసిపోతున్నారు.

- అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆన్‌లైన్ చేయించుకున్న టీడీపీ నేతలు
- పొలాల్లోకి రాకుండా అడ్డుకుంటూ బెదిరింపులు
- ప్రస్తుతం రెవెన్యూ కోర్టులో నడుస్తున్న భూముల వ్యవహారం





దళితులకు ప్రభుత్వం కేటాయించిన భూమి



దళితుల పేరుతో ప్రభుత్వం మంజూరు చేసిన భూమి పట్టా

రెవెన్యూ శాఖ అవినీతి..

కందుకూరు: నిరు పేదలైన దళితుల బతుకుదెరువుకు ప్రభుత్వం తలా ఎకరా పొలం ఇచ్చింది. దాదాపు పాతికేళ్లుగా ఆ భూములను సాగు చేసుకుంటూ అదే జీవనాధారంగా బతుకుతున్నారు. ఆ భూములకు సాగు, అనుభవం సైతం సదరు దళితుల పేర్లతోనే రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ అధికారంలోకి రావడంతో స్థానికంగా ఉండే టీడీపీ నేతలు ఆ భూములపై కన్నేశారు. రెవెన్యూ అధికారులను ప్రలోభ పెట్టి రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. అప్పటి నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో ఆర్డీఓ కోర్టులో కేసు వేశారు. అక్కడ దళితులకు అనుకూలంగా రావడంతో జీర్ణించుకోలేని టీడీపీ నేతలు జాయింట్ కలెక్టర్ కోర్టులో అప్పీల్ చేశారు. ఈ నెల 19వ తేదీ విచారణకు రానున్న నేపథ్యంలో టీడీపీ నేతలు తాజాగా జేసీబీలు పెట్టి భూముల్లోని చెట్టుపుట్ట తొలగించే పనిలో ఉన్నారు.

అధికారాన్ని అడ్డం పెట్టుకుని..

అధికారమే అండగా కొందరు నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లింగసముద్రం మండలం వెంగళాపురంలో దళితుల భూములను కాజేసే వ్యవహారం ప్రస్తుతం ఇరువర్గాల మధ్య వివాదంగా మారింది. అయితే అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమ భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారంటూ గ్రామానికి చెందిన దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంగళాపురం గ్రామానికి చెందిన దళిత, గిరిజనులకు ప్రభుత్వం సర్వే నంబర్ 139లో మొత్తం 14 ఎకరాల భూమిని కేటాయించింది. 1997లో గ్రామానికి చెందిన 14 మంది ఉన్నం భాస్కర్, ఉన్నం మాల్యాద్రి, ఉన్నం మునలయ్య, సింగయ్య, సుబ్బారావు, మాల్యాద్రి, ఉన్నం సుబ్బారావు, కొండయ్య, దానం బాబూరావు, చిడితోటి అంకయ్య, చిడితోటి రామయ్య, జగన్నాథం నాగేశ్వరరావు, ఉన్నం యానాది, ఉన్నం నరసింహం తదితరులకు ఒక్కొక్కరి ఎకరా చొప్పున అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చింది. అప్పటి నుంచి ఈ భూములను వారు సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వెంగళాపురంలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేతలు ఇద్దరు ఆ భూములపై కన్నేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెవెన్యూ రికార్డులు, పట్టాలు, అడంగళ్ల ఆ 14 మంది పేరుపైనే ఉన్నా రెవెన్యూ అధికారులను ప్రలోభ పెట్టి రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డులను తమ పేరిట మార్పు చేయించుకున్నారు. ఏ ఆధారాలు లేకుండా వీరిపై అధికారులు ఏ విధంగా ఆన్‌లైన్ చేశారనేది అర్థంకాని ప్రశ్న. దీంతో ఈ భూముల వ్యవహారం ఇరువర్గాల మధ్య వివాదాస్పదంగా మారింది. దళితులు మాత్రం తమ భూములను అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని, అన్నీ ఆధారాలు తమ వద్ద ఉన్నా అధికారులను మేనేజ్ చేసి ఆన్‌లైన్ చేయించుకున్నారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలో ఉండడంతో తమ భూములను బలవంతం లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. భూములకు సంబంధించిన వివాదం ఇప్పటికే ఐదేళ్లుగా రెవెన్యూ కోర్టులో నడుస్తుంది. గతంలో ఆర్డీఓ కోర్టులో దళితులకు అనుకూలంగా తీర్పు రావడంతో జీర్ణించుకోలేని టీడీపీ నేతలు జాయింట్ కలెక్టర్ కోర్టులో అప్పీల్ చేశారు, ఈ నెల 19న జేసీ కోర్టులో విచారణ జరగనుంది. ఈ లోపే బలవంతంగా జేసీబీలతో భూములను చదును చేసే ప్రయత్నం చేస్తున్నారని, తమను పోలీసులతో బెదిరిస్తున్నారని దళితులను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోర్టులో ఉన్న భూముల్లో ఎలా వస్తారని అధికారులు వివాదాన్ని పరిష్కరించి భూములు ఎవరికి చెందినవో తేల్చే వరకు ఆగకుండా బలవంతంగా భూములను లాక్కునే ప్రయత్నం జరుగుతుందని విచారం వ్యక్తం చేస్తున్నారు. భూములకు సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ భూములను వదులుకునే ప్రసక్తే లేదని చెబుతున్నారు.

సాక్ష్యాలు, ఆధారాలు చూపకుండా అక్రమ కేసులు

- నా రాజకీయ ప్రత్యర్థుల కక్ష సాధింపు చర్యలే
- ఫిర్యాదులో పేర్కొన్న అంశాల్లో ఏ మాత్రం వాస్తవాల్లేవు
- పంటపాళెం మద్యం కేసు విచారణలో కాకాణి సమాధానాలు



సాక్షిప్రతినిధి, నెల్లూరు: 'నా రాజకీయ ప్రత్యర్థులు నన్ను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. రాజకీయంగా నన్ను ఎదుర్కోలేక వ్యక్తిగతంగా నాపై నిందారోపణలు చేసి పబ్బం గడుపుకోవాలని అక్రమ కేసులు బనాయించారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు రెండు రోజుల కస్టడీ విచారణ సమయంలో ఏ ఒక్క సాక్ష్యాన్ని, ఒక్క ఆధారాన్ని చూపించలేకపోయారు. అంటే ఇది అక్రమ కేసేనని తేలిపోతుందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎక్సైజ్ అధికారులను నిలదీసినట్లు సమాచారం. ముత్తుకూరు మండలం పంటపాళెంలో మద్యం అక్రమ నిల్వల కేసులో ఆదివారం పోలీసు శిక్షణా కేంద్రంలో కాకాణిని రెండో రోజు ఆయన తరఫు న్యాయవాది కె. శ్రీనివాసరావు సమక్షంలో ఇందుకూరుపేట ఎక్సైజ్ అధికారులు 24 ప్రశ్నలు వేసి విచారించారు. ఆయా ప్రశ్నలకు కాకాణి దీటుగా సమాధానమిచ్చారు. తప్పుడు ఫిర్యాదులు, అక్రమ కేసు అని ఇప్పటికే పలుమార్లు చెప్పినా పదేపదే అవే ప్రశ్నలు లేవనెత్తడం దారుణమని, ఫిర్యాదులో పేర్కొన్న అంశాల్లో ఏ మాత్రం వాస్తవాలు లేవని, ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన కేసేనని నాతోపాటు మీ అందరికీ తెలుసని, మద్యం అక్రమ నిల్వల విషయంలో నాకు ఎలాంటి సంబంధం లేదు. అలాంటప్పుడు దాని పర్యవసనాలు ఏవి నాకు ఆపాదించవు. కేవలం కక్ష పూరితంగానే ఈ కేసు నమోదు చేశారంటూ కాకాణి ఎక్సైజ్ అధికారులకు చెప్పినట్లు సమాచారం. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎక్సైజ్ అధికారులు ఎన్నికల సంఘం పర్యవేక్షణలో విధులు నిర్వర్తించారు. తాను ఎక్సైజ్ అధికారులను ప్రభావితం చేశామని పేర్కొనడంలో వాస్తవం లేదన్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులే సమాధానం చెబితే బాగుంటుందని కాకాణి పేర్కొన్నట్లు సమాచారం. ఎన్నికల్లో నేను చేసిన అభివృద్ధి, మేము అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓటు వేయాలని ప్రచారం చేశాను. విచారణకు తాను ఎప్పుడూ సిద్ధం. రెండు రోజుల కస్టడీలో సంబంధం లేని విషయాలపై పదేపదే ప్రశ్నించారు. నాకు వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యం, ఆధారం లేదు. కస్టడీలో ఉన్నప్పుడే మిగిలిన నిందితులుగా పేర్కొన్న వారిని, ఫిర్యాదుదారుడిని పిలిపించి ఉంటే అసలు ఫిర్యాదుదారుడు నాకు పరిచయం ఉన్నాడా? లేదా అనే విషయం అర్థమయ్యి ఉండేదని ఎక్సైజ్ అధికారులకు సూచించినట్లు తెలిసింది. నిర్దిష్టమైన ఆధారాలు లేకుండా ఎవరో ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను పట్టుకుని ప్రశ్నించడం ఎంత వరకు కరెక్ట్ అని ఎక్సైజ్ అధికారులను నిలదీసినట్లు తెలిసింది.

ముగిసిన కాకాణి పోలీస్ కస్టడీ విచారణ

నెల్లూరు (లీగల్): ముత్తుకూరు మండలం పంటపాళెంలో అక్రమంగా మద్యం నిల్వలు ఉంచారనే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండు రోజుల ఎక్సైజ్ పోలీస్ కస్టడీ ఆదివారంతో ముగిసింది. కోర్టు అనుమతితో జిల్లా కేంద్ర కారాగారం నుంచి ఇందుకూరుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. జైలు సమీపంలోని జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో కాకాణి తరఫు న్యాయవాది సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, మధ్యవర్తులు వీఆర్వోలు శ్రీపతి మునిరాజు, చల్లా సూర్యకుమార్ సమక్షంలో కాకాణిని ఇందుకూరుపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్‌రెడ్డి రెండో 24 ప్రశ్నలు అడిగారు. కోర్టు ఇచ్చిన కస్టడీ గడువు ముగియడంతో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం నెల్లూరు స్పెషల్ ఎక్సైజ్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి నిషాద్ నాజ్ షేక్ నివాసంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల ఉత్తర్వులు మేరకు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

ప్రసన్న ఇంట్లో దాడిపై కేసు నమోదు



వివరాలు సేకరిస్తున్న దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య

- ఆరో రోజుల తర్వాత నామమాత్రపు సెక్షన్లతో ఎఫ్ఐఆర్
- దాడికి పాల్పడిన నిందితుల పేర్లు ఇచ్చినా నమోదు చేయని వైనం
- ఘటనా స్థలంలో వివరాల సేకరణ

సాక్షిప్రతినిధి, నెల్లూరు: మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో టీడీపీ మూకలు సాగించిన విధ్వంసంపై ఎట్టకేలకు పోలీసు అధికారులు స్పందించారు. ఘటన జరిగి ఆరు రోజుల తర్వాత నెల్లూరు దర్గామిట్ట పోలీసులు నామమాత్రపు సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ఆదివారం దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి అందుకు దారి తీసిన పరిస్థితుల వివరాలను ప్రసన్నకుమార్‌రెడ్డి నుంచి సేకరించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వారి ముఖ్య అనుచరుల ప్రోద్బలంతో ఈ నెల 7వ తేదీ రాత్రి సుమారు 9 గంటల సమయంలో టీడీపీ మూకలు మారణాయుధాలతో సుజాతమ్మ కాలనీలోని ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లోకి అక్రమంగా చొరబడి విధ్వంసం సృష్టించారు. ప్రసన్నకుమార్‌రెడ్డిని చంపేస్తామని బెదిరించి ఇంట్లోని వారిపై దాడి చేశారు. ఇంటి గోడలు మినహా ప్రతి గదిలోని వస్తువులు, ఫర్నీచర్‌తో సహా ధ్వంసం చేశారు. ఈ ఘటనపై అదే రోజు అర్ధరాత్రి ప్రసన్న అనుమానితుల పేర్లను ఉటంకిస్తూ వేమిరెడ్డి దంపతులు తనను హత్య చేయించేందుకు పథకం పన్నారని నగర డీఎస్పీ పి.సింధుప్రియకు ఫిర్యాదు చేశారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. అయితే దర్గామిట్ట పోలీసులు జీడీ ఎంట్రీతో సరి పెట్టారు అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసు అధికారులు కేసు నమోదు చేయడంలో జాప్యం చేస్తుండడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళనలు తీవ్రతరం చేశారు. మరో వైపు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. ఇది ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందోనని పోలీసు అధికారుల్లో భయం మొదలైంది. దీంతో ఎట్టకేలకు ఆరు రోజుల అనంతరం శనివారం రాత్రి 189(4), 329(4), 324(5), 332(సీ), 351(2), ఆర్/డబ్ల్యూ(5) 190 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో అనుమానితుల పేర్లతోపాటు పాటు వేమిరెడ్డి దంపతుల ప్రోద్బలంతోనే దాడి జరిగిందని పేర్కొన్నప్పటికీ పోలీసు అధికారులు మాత్రం గుర్తుతెలియని వ్యక్తులు దాడులకు పాల్పడినట్లు ఎఫ్ఐఆర్‌లో పొందుపరచడం గమనార్హం.

మీకు అండగా మేముంటాం



టెంకాయచెట్లపాళెంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మాధవరావు

- కరేడు రైతులకు ఎమ్మెల్సీ తూమాటి హామీ

ఉలవపాడు: కరేడు ప్రాంత రైతుల పోరాటానికి అండగా ఉంటామని, మీకు అన్యాయం జరగకుండా అన్ని వేదికల్లో మాట్లాడుతామని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు హామీ ఇచ్చారు. ఆదివారం కరేడు పంచాయతీ పరిధిలోని టెంకాయచెట్లపాళెం, కొత్తపల్లెపాళెం, చినపల్లెపాళెం, చైతన్యనగర్, కరేడు, పెద్దపల్లెపాళెం గ్రామాల్లో ఆయన పర్యటించి గ్రామ ప్రజలు, రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మీ పోరాటంలో మేము ముందుంటాము.. పచ్చని పంటలు పండుతున్న భూములు తీసుకోవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తాను. నెల్లూరు జిల్లా డీఆర్సీ సమావేశం, శాసనమండలిలో ప్రభుత్వం ఏకపక్ష వైఖరిపై ప్రశ్నించమే కాకుండా రైతుల గుంతుకై అభిప్రాయాలను తెలియజేస్తామన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరించొద్దని పోరాడుతామన్నారు.

సముద్రాన్ని వదిలి మేము వెళ్లలేం

టెంకాయచెట్లపాళెం మత్స్యకారులు మాట్లాడుతూ సముద్రాన్ని వదిలి మేము వెళ్లం. ముఖ్యమంత్రి వచ్చినా భూములు ఇవ్వం, ప్రాణాలైనా వదులుకుంటామంటూ తూమాటికి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఏదైనా సమావేశం ఏర్పాటు చేస్తే జైజవాన్, జైకిసాన్ అని అంటారు. ఇప్పుడు కిసాన్‌ను వెళ్లిపొమ్మంటున్నారు. ఇది ఎంత వరకు న్యాయమో ఆలోచించండని తెలిపారు. తాము భూములు ఇచ్చేదానికి సిద్ధంగా లేమన్నారు. తాము ఎక్కడికీ వెళ్లేది లేదన్నారు. రైతుల అభిప్రాయాలను గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, రైతు ఉద్యమ జేఏసీ అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ సయ్యద్ ఫజుల్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, ఎంపీటీసీలు రాధామాధవి, రమణయ్య, మాజీ సర్పంచ్ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, మోహన్‌బాబు, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, రవికాంత్, మహీధరరెడ్డి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



వేడుకగా అగ్నిగుండం

నెల్లూరు నగరంలోని మూలాపేటలోని శ్రీమత్ ద్రౌపతీదేవి సమేత శ్రీకృష్ణధర్మరాజ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో 19వ రోజు ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఉత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు తరలివచ్చారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా

మహిళ మెడలో గొలుసు చోరీ

నెల్లూరు(క్రైమ్): ఉక్కపోతగా ఉండటంతో తలుపును దగ్గరగా వేసి వివాహిత తన కుమార్తెతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా, గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసును చోరీ చేశారు. వివరాలు.. జనార్దన్‌రెడ్డికాలనీలోని లక్ష్మీపార్వతినగర్‌లో సురేంద్ర, సౌమ్య దంపతులు నివాసం ఉంటున్నారు. వరండాలో ఆయన.. కుమార్తెతో కలిసి ఇంట్లో ఆమె నిద్రించారు. ఉక్కపోతగా ఉండటంతో తలుపును దగ్గరకు వేశారు. ఈ తరుణంలో ఇంట్లోకి గుర్తుతెలియని దుండగుడు ప్రవేశించి, ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును కట్ చేసి తీసుకెళ్తుండగా, అలికిడైంది. బాధితులు నిద్ర నుంచి లేచేసరికే నిందితుడి అక్కడి నుంచి పరారయ్యారు. నిందితుడి కోసం చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లభించలేదు. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

యాచకుడి మృతి



వలేటివారిపాలెం: అనారోగ్యంతో యాచకుడు మృతి చెందిన ఘటన వలేటివారిపాళెంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై మరిడినాయుడి వివరాల మేరకు.. ఉప్పలపాడు సమీపంలోని కస్తూర్బా విద్యాలయం పక్కన ఉన్న కాలనీలో నివసిస్తూ గురునాథం నాగరాజు (30) భిక్షాటన చేసుకుంటున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. అంత్యక్రియల నిమిత్తం గ్రామస్తులు చందాల రూపంలో మృతుడి బంధువులకు సహకరిస్తున్నారు.

సవక తోట దగ్ధం



సైదాపురం: విద్యుత్ తీగలు తెగి మంటలు చెలరేగడంతో పదెకరాల్లో సవక తోట దగ్ధమైన ఘటన మండలంలోని గిద్దలూరులో ఆదివారం చోటుచేసుకుంది. రైతుల వివరాల మేరకు.. మండలంలోని గిద్దలూరులో కంభం శ్రీకాంత్, మరో ఐదుగురు రైతులు సుమారు వందెకరాల్లో సవక తోటలను సాగు చేస్తున్నారు. సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. తరచూ విద్యుత్ వైర్లు ఒకదానికొకటి రాసుకొని మంటలు వ్యాపిస్తుంటాయి. ఈ తరుణంలో విద్యుత్ వైర్లు రాసుకొని మంటలు చెలరేగి సవక తోటలోకి వ్యాపించాయి. సుమారు పదెకరాల్లో సవక తోట కాలిబూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.ఐదు లక్షల మేర నష్టం సంభవించిందని రైతులు తెలిపారు.

కండలేరులో నీటి నిల్వ



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారానికి 30.316 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగకు 2050, పిన్నేరుకు 100, లోలెవల్‌కు 70, హైలెవల్‌కు 15, మొదటి బ్రాంచ్ కాలువలకు 65 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్: 119
లేయర్ లైవ్: 112
బ్రాయిలర్ చికెన్: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్: 240
లేయర్ చికెన్: 190



పొదలకూరు నిమ్మ ధరలు

పెద్దవి: రూ.24
సన్నవి: రూ.15
పండ్లు: రూ.5



అన్నదాత నిలువు దోపిడీ



ఈ చిత్రంలో కనిపిస్తున్న పేరం విష్ణు వరికుంటపాడు మండలం గణేశ్వరపురానికి చెందిన రైతు. మూడెకరాల్లో వరిని సాగు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పైర్లకు అవసరమైన కాంప్లెక్స్, యూరియా ఎరువులు గ్రామంలోని ఆర్బీకేలో లభించేవి. అయితే ప్రస్తుతం ఇవి రాలేదు. దీంతో సమీపంలోని పట్టణాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. రవాణా రూపంలో ఒక్కో బస్తాకు రూ.50 చొప్పున వెచ్చిస్తున్నారు. యూరియాను రూ.350కు కొనుగోలు చేస్తున్నారు. గతంలో దీన్ని రూ.266కు ఇంటి వద్దే పొందేవారు.

- యూరియా కృత్రిమ కొరత
- ధరలు పెంచి దోచుకుంటున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న వ్యవసాయాధికారులు



సాగులో ఉన్న వరి

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం రైతుల పాలిట శాపంలా పరిణమించింది. ఓ వైపు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేకపోవడం.. మరో వైపు ఎరువుల కృత్రిమ కొరతతో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. అన్నదాతా సుఖీభవ, పంట నష్టపరిహారం తదితరాలు సక్రమంగా అందక వారు ఆర్థికంగా అల్లాడిపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్లో మూడు లక్షలెకరాల్లో వరిని సాగు చేశారు. దీనికి తోడు కొన్ని ప్రాంతాల్లో వివిధ రకాల పైర్లను వేశారు. దీంతో యూరియాకు డిమాండ్ ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసుకున్న ముఖ్య డీలర్లు జిల్లాకు వచ్చిన యూరియాను తమ ఆధీనంలో ఉంచుకొని కృత్రిమ కొరత సృష్టించారు. డిమాండ్‌ను బట్టి అధిక ధరలకు విక్రయిస్తూ రైతుల జేబులకు చిల్లు పెడుతున్నారు. వాస్తవానికి బస్తా యూరియా ధర రూ.266 కాగా, రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. వింజమూరు, కలిగిరి, ఉదయగిరి, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో రూ.350కు.. గ్రామీణ ప్రాంతాల్లో రూ.400 నుంచి రూ.450 వరకు అమ్ముతున్నారు.

సరఫరా అయింది సగమే..

జిల్లాలో ప్రస్తుతం సాగులో ఉన్న వివిధ పైర్లకు వ్యవసాయాధికారుల సిఫార్సు మేరకు 90 వేల టన్నుల యూరియా అవసరం ఉంది. అయితే నేటికి ఇందులో సగమే వచ్చింది. వీటిని కొంతమంది డీలర్లు బ్లాక్ చేస్తున్నారు.



యూరియా బస్తాలు

గత ప్రభుత్వంలో సజావుగా..

గత ప్రభుత్వ హయాంలో నాటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలిచారు. సీజన్‌కు ముందే సాగు విస్తీర్ణానికి సరిపడా ఎరువులను సిద్ధం చేసేవారు. ఆర్బీకేల ద్వారా ఎమ్మార్పీ ధరలకే నాణ్యమైన ఎరువులను గ్రామాల్లో సరఫరా చేశారు. నకిలీ ఎరువులను వ్యాపారులు విక్రయించకుండా, అధిక ధరలకు అమ్మకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరాక గతేడాది రబీ సీజన్లో వివిధ రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచి రూ.ఐదు కోట్ల భారాన్ని అన్నదాతలపై మోపారు. ఈ ఖరీఫ్ సీజన్లోనూ వీటిని తగ్గించలేదు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల సరఫరాను కూటమి ప్రభుత్వం నిలిపేసింది. దీంతో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి యూరియాకు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచి దోచుకుంటున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జిల్లాలో రైతుల అవసరాల మేరకు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నాం. జిల్లాలో ఈ సీజన్లో సాధారణం కంటే రెట్టింపు స్థాయిలో వరిని సాగు చేశారు. నిర్దేశించిన దాని కంటే అధిక మొత్తంలో యూరియాను వేస్తున్నారు. దీంతో కొంత సమస్య ఉంది. మరో ఎనిమిది వేల టన్నుల యూరియా త్వరలో రానుంది. వీటిని సొసైటీ, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతాం. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

ప్రమాణాలు పాటించని హోటళ్లపై చర్యలు



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని హోటల్లో ఎంహెచ్‌ఓ తనిఖీలు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ నిర్దేశించిన ప్రమాణాలను నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని రెస్టారెంట్లు, హోటళ్లు తప్పక పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంహెచ్‌ఓ చైతన్య స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వివిధ రెస్టారెంట్లు, హోటళ్లను ఆకస్మికంగా ఆదివారం తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్సులు, ఎన్‌ఓసీని పరిశీలించారు. వంటశాలల్లో నిర్వహణ తీరును పర్యవేక్షించారు. తయారీదారులు, సర్వర్ల వ్యక్తిగత పరిశుభ్రతను మెరుగుపర్చాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడారు. హోటళ్లలో ప్రమాణాలను మెరుగుపర్చేలా నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగంపై అవగాహనను పెంపొందించుకొని, వస్త్ర సంచులనే వినియోగించాలని కోరారు. నెల్లూరు నగరపాలక సంస్థ, ఆహార ప్రమాణాల భద్రత సంస్థల ఆధ్వర్యంలో తనిఖీలను త్వరలో నిర్వహించనున్నామని వెల్లడించారు.

పచ్చముఠా దోపిడీ

- ఇష్టారాజ్యంగా ఇసుక, గ్రావెల్, బండరాళ్ల తరలింపు
- రాజుపాళెంలో యథేచ్ఛగా అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు



రీచ్‌లో పెద్ద రాళ్లను తరలిస్తూ..

సాక్షి టాస్క్‌ఫోర్స్: వెంకటగిరి నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, బండరాళ్లను అక్రమంగా తరలిస్తూ సహజ సంపదను పచ్చముఠా లూటీ చేస్తోంది. ఓ నేత కనుసన్నల్లో ఈ మాఫియా చెలరేగిపోతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సహజ సంపదను గుల్ల చేసి రూ.కోట్లను వెనుకేసుకుంటున్నారు. జిల్లాలోని కలువాయి మండలం రాజుపాళెం సమీపంలో గల పెన్నాలో ఇసుక తవ్వకాలకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతివ్వలేదు. అయినా తమ్ముళ్లు మాత్రం ఇసుక రేవుల్లో పడి అందినంత దోచేస్తున్నారు. దీనికి తోడు పెన్నాలో నీటి ప్రవాహానికి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో అక్కడ లభించే పెద్ద రాళ్లతో పాటు గ్రావెల్‌ను సైతం నిర్భయంగా తరలించుకుపోతున్నారు.

రీచ్‌లు స్టాపైనా.. ఆగని అక్రమ రవాణా

జిల్లాలోని ఇసుక రీచ్‌లకు అక్టోబర్ 15 వరకు అనుమతులను అధికారులు రద్దు చేశారు. అయితే ఈ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ రాజుపాళెం రీచ్‌లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. కూటమి నేతల కనుసన్నల్లో దీన్ని జరిపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిత్యం సగటున వంద వాహనాల్లో ఇసుకను ఇతర రాష్ట్రాలకు పగలూ.. రాత్రనే తేడా లేకుండా రవాణా చేస్తున్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఈ అక్రమార్జనలో భాగస్వాములయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నదిలోకి రాచబాట

పర్యావరణానికి తూట్లు పొడుస్తూ పెన్నాలోకి ఇసుకాసురులు రాచబాట వేశారు. తెలుగురాయపురానికి ప్రధాన రహదారి నుంచి నది మధ్యలోకి రోడ్డేశారు. రాజుపాళెంలోని ప్రధాన రహదారి నుంచి ప్రైవేట్ వ్యక్తికి చెందిన మామిడి తోట మీదుగా నిర్మించారు. దీనికి గానూ సదరు వ్యక్తికి నెలకు రూ.50 వేలు ముట్టజెప్తున్నారు. నదీ గర్భంలోకి రోడ్డేసినా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటంలేదు.



ఇసుకను అక్రమంగా రవాణా చేసేందుకు ఏర్పాటు చేసిన దారి

వ్యసనాలకు బానిసలై నేరాలు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్

- దోపిడీ ముఠా అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వ్యసనాలకు బానిసలైన యువకులు వాటిని తీర్చుకునేందుకు సరిపడా నగదు కోసం ముఠాగా ఏర్పడి దోపిడీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు. నగరంలోని వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. నెల్లూరు రూరల్ మండలం చంద్రబాబునగర్‌కు చెందిన విజయ్ అలియాస్ పుండా, సుధీర్, సిరాజ్, పోలీస్ కాలనీ ప్రాంతానికి చెందిన అనిల్, ఓ ప్రైవేట్ స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న సాయికుమార్ పెద్దగా చదువుకోలేదు. వ్యసనాలను తీర్చుకునేందుకు సరిపడా నగదు కోసం దోపిడీలకు తెరలేపారు. ఇందులో భాగంగా తల్పగిరికాలనీ సమీపంలో నాగేంద్ర అనే వ్యక్తిని కత్తులతో చంపుతామంటూ ఈ నెల 11వ తేదీ సాయంత్రం బెదిరించి అతని ఫోన్ పే ద్వారా రూ.ఐదు వేలను ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. విషయాన్ని బయట చెప్తే చంపేస్తామని బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చంద్రబాబునగర్ సమీపంలోని ఖాళీ ప్లాట్ల వద్ద నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్సై నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుల కోసం ముమ్మర గాలింపు



ఫంక్షన్ హాల్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్

ఉదయగిరి: పట్టణంలో సంచలనం రేపిన మహమ్మద్ హమీద్ హత్య కేసులో నిందితుల కోసం గాలింపు చర్యలను పోలీసులు ముమ్మరం చేశారు. నిందితులు ఉమర్ అలీ, హనీఫ్‌ను పట్టుకునేందుకు గానూ రెండు ప్రత్యేక బృందాలను కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కావలి డీఎస్పీ శ్రీధర్ ఏర్పాటు చేశారు. పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన ఈ హత్యలో పలువురి ప్రమేయం ఉండొచ్చనే కోణంలో విచారణ జరుపుతున్నారు. హత్యానంతరం స్కూటీలో గోదాము వరకెళ్లి, అక్కడ ఉంచిన కారులో పరారైన విషయంలో ఎవరెవరు సహకరించారనే కోణంలో ఆరాతీస్తున్నారు. మరోవైపు ప్రకాశం జిల్లాలోని ఓ రహస్య ప్రదేశంలో నిందితులు తలదాచుకున్నారనే ప్రచారం జరుగుతోంది. నిందితులను పోలీసులకు అప్పగించేందుకు ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన ఓ వ్యక్తి సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం. రెండు రోజుల్లో లొంగిపోతారని ఓవైపు.. పోలీసుల అదుపులో ఇప్పటికే ఉన్నారనే ప్రచారమూ జరుగుతోంది.

విచారణ పేరిట ఇబ్బంది పెడతారా..?

- బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన



ఎస్సైతో వాగ్వాదం

ఉదయగిరి: పట్టణంలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాల్ ఆస్తి వివాదం నేపథ్యంలో జరిగిన హత్యను ఉదయగిరి బీసీ కాలనీకి చెందిన ఓ యువకుడు తన ఫోన్లో చిత్రీకరించారు. గమనించిన నిందితులు దాడికి యత్నించడంతో భయంతో పరారయ్యారు. ఈ దృశ్యాలను సదరు యువకుడు తన మిత్రులకు షేర్ చేయడంతో వీడియో వైరలైంది. దీంతో కేసులో ఈ వీడియో పోలీసులకు కీలకంగా మారింది. సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకునేందుకు గానూ యువకుడి తల్లిదండ్రులను మూడు రోజులుగా స్టేషన్‌కు పిలిపించి ఆచూకీ చెప్పాలని ఒత్తిడి తెస్తున్నారు. తమ కుమారుడి ఆచూకీ తెలియక అల్లాడుతుంటే, ఇబ్బంది పెట్టడమేమిటంటూ స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఆందోళనను ఆదివారం చేపట్టారు. సుమారు 200 మంది బీసీ కాలనీ వాసులు రోడ్డును దిగ్బంధించారు. దీంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వీరిని శాంతింపజేసేందుకు యత్నించారు. పోలీసులు.. ఆందోళనకారుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం ఆందోళనను విరమించారు.

జీఓ 36 మేరకు జీతాలివ్వాలి



మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ర్యాలీ

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వర్తించే కార్మికులకు జీఓ నంబర్ 36 మేరకు జీతాలివ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య, సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు విధులను ఆదివారం బహిష్కరించారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ వరకు చేపట్టిన ర్యాలీలో వారు మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబు, సంబంధిత అధికారులను పలుమార్లు కలిసినా, ప్రయోజనం లేదని ఆరోపించారు. చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విధిలేక సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే విధులను పారిశుధ్య కార్మికులు ఈ నెల 17 నుంచి బహిష్కరించి సమ్మెలోకి వెళ్లనున్నారని స్పష్టం చేశారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, శివాజీ, సురేష్, మున్సిపల్ ఇంజినీరింగ్ నేతలు శ్రీనివాసులు, బాలు, మనోజ్, జిల్లా అధ్యక్షురాలు కామాక్షమ్మ, నెల్లూరు నగరాధ్యక్ష, కార్యదర్శులు సునీల్, అశోక్, నేత సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కండి



మాట్లాడుతున్న రామన్న

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలంటూ రానున్న రోజుల్లో చేపట్టనున్న పోరాటాలకు సిద్ధంగా ఉండాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న పిలుపునిచ్చారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన డీవైఎఫ్ఐ నెల్లూరు రూరల్ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని అందజేయాలని డిమాండ్ చేశారు. యువత సత్తా ఏమిటో రానున్న రోజుల్లో ప్రభుత్వానికి తెలియజేస్తామని స్పష్టం చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. డీవైఎఫ్ఐ నెల్లూరు రూరల్ అధ్యక్ష, కార్యదర్శులుగా శశి, చైతన్య, సహాయ కార్యదర్శిగా రాజా, ఉపాధ్యక్షుడిగా బాపనయ్య, కోశాధికారిగా మధు, 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మాదాల వెంకటేశ్వర్లు, కట్టా సతీష్, కొండా ప్రసాద్, పెంచలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.